సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 6 । ఆగస్టు । 2025



ఇదేం న్యాయం..?

సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో కార్మికులు, ఉద్యోగుల పిల్లలకు న్యాయమైన వాటా దక్కడం లేదనే విమర్శలు ఉన్నాయి. 10లో



గ్రామాలకు వెళ్లకుండానే హాజరు

పంచాయతీ కార్యదర్శులు విధులకు వెళ్లకుండానే హాజరు నమోదు చేసుకుంటున్నట్లు వెల్లడి కావడంతో నోటీసులు జారీ చేశారు. 10లో

గరిష్టం / కనిష్టం
33° / 25°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం కొన్ని చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఖమ్మం కలెక్టర్‌ను కలిసిన ఐటీడీఏ పీఓ



అనుదీప్‌కు మొక్క అందిస్తున్న రాహుల్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఖమ్మం కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంక్షేమానికి సంబంధించిన అధికారిక సమావేశాలు ఖమ్మం కలెక్టరేట్‌లో జరుగుతున్న నేపథ్యంలో అక్కడికి వెళ్లిన రాహుల్.. కలెక్టర్‌ను కలిశారు. గిరిజన గ్రామాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై చర్చించారు.

రేపు జాబ్‌మేళా

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 7వ తేదీన నిరుద్యోగులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లో కొత్తగూడెం, పాల్వంచ, జూలూరుపాడు, మణుగూరు, భద్రాచలం, ఖమ్మం జిల్లా సత్తుపల్లి, తల్లాడల్లో సెంటర్ మేనేజర్/ఈఆర్ఓ/ఎల్ఆర్ఓ రూరల్/మైక్రోలోన్స్ పోస్టుల్లో పని చేయాల్సి ఉంటుందని వివరించారు. 18 – 32 సంవత్సరాల వయసు కలిగి, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

బ్యాండెడ్ క్రైట్ కలకలం

పాముల్లో అత్యంత విషపూరితమైనదిగా పేరు



బ్యాండెడ్ క్రైట్ పాము

మణుగూరు టౌన్: మణుగూరులో బ్యాండెడ్ క్రైట్ పాము కలకలం సృష్టించింది. సింగరేణి అధికారులు నివాసముండే ప్రాంతంలో ఈ పాము సోమవారం అర్ధరాత్రి కనిపించగా స్నేక్ క్యాచర్ సాయంతో బంధించి అడవిలో వదిలేశారు. మణుగూరు సింగరేణి ఏరియాలోని ఓ అధికారి నివాసంలో పాము తిరగడాన్ని ఆయన కుటుంబీకులు గుర్తించారు. దీంతో స్నేక్ క్యాచర్ మహ్మద్ ముజాఫర్‌కు సమాచారం ఇవ్వగా ఆయన చేరకుని దాదాపు మూడున్నర గంటల పాటు శ్రమించి పామును పట్టుకున్నారు. అయితే, ఈ పామును పరిశీలించగా బ్యాండెడ్ క్రైట్‌గా తేలింది. పాముల్లో అత్యంత విషపూరితమైనదిగా భావించే ఇది కాటు వేస్తే మరణం అంచుల్లోకి చేరతారని, చికిత్స కాస్త ఆలస్యమైనా పక్షవాతం లేదా అవయవాలన్నీ చచ్చుపడిపోతాయని చెబుతున్నారు. రాత్రిపూట మాత్రమే సంచరించే ఈ రకం పాము ఒడిశా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో అధికంగా కనిపిస్తుందని పేర్కొన్నారు. ఈ మేరకు పామును బంధించి అటవీ ప్రాంతంలో వదిలేయడంతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ ఫొటోతో సహా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు.

గంజాయి రవాణాకు ఏఐతో బ్రేక్!

అక్రమార్కుల ఆటలు కట్టించేందుకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత నిఘా వ్యవస్థ జిల్లాలో అందుబాటులోకి వచ్చింది. భద్రాచలం వద్ద గోదావరి వంతెన సమీపంలో ఏఐ ఆధారిత నిఘా వ్యవస్థ ఏర్పాటైంది. గంజాయి, ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ ఆధునిక వ్యవస్థ.. ఏ మేరకు పని చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

– సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఏపీ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి అక్రమంగా రాష్ట్రంలోకి..

- భద్రాచలం మీదుగా ఇతర ప్రాంతాలకు సరఫరా
- భద్రాద్రి వంతెన వద్ద అందుబాటులోకి ఆధునిక నిఘా
- ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో అక్రమార్కుల గుర్తింపు





గోదావరి వంతెన వద్ద ఏర్పాటవుతున్న చెక్ పోస్టు (ఇన్‌సెట్) కొత్తగా అమర్చిన సీసీ కెమెరాలు

వారధిగా భద్రాద్రి

ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలతో జిల్లా సరిహద్దులు పంచుకుంటోంది. అంతేకాక.. ఒడిశాకు అతి సమీపంలో ఉంది. దీంతో ఈ మూడు రాష్ట్రాల నుంచి వాహనాలు జిల్లా మీదుగా తెలంగాణలోకి రాకపోకలు సాగిస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణాలోకి వచ్చేందుకు అశ్వారావుపేట దగ్గర ఓ హైవే ఉండగా, భద్రాచలం వద్ద మరో జాతీయ రహదారి ఉంది. ఇందులో భద్రాచలం మీదుగా వెళ్లే ఎన్‌హెచ్ – 30 రహదారి గంజాయి అక్రమ రవాణాకు కీలకంగా మారింది. ఛత్తీస్‌గఢ్, ఆంధ్రా, ఒడిశా సరిహద్దుల్లో ఉన్న ఎత్తయిన కొండలు, దట్టమైన అడవుల్లో పండించిన గంజాయిని జిల్లా మీదుగా హైదరాబాద్ తదితర ప్రాంతాలకు తరలించడం పరిపాటిగా మారింది. దీంతో కేవలం గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునేందుకే భద్రాచలంలో గోదావరి వంతెన ప్రారంభంలో చెక్‌పోస్టు ఏర్పాటు చేసి 24 గంటలూ నిర్విరామంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

నిఘా పెరిగింది

జిల్లాలో గోదావరి తీరంలో ఇసుక ర్యాంపులు ఉన్నాయి. ఇక్కడి రీచ్‌ల నుంచి వెళ్లే ఇసుక మార్గమధ్యలో పక్కదారి పడుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఇసుక అమ్మకాల్లో పారదర్శకత తెచ్చేందుకు తెలంగాణ మినరల్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిఘాను పెంచింది. రీచ్‌ల దగ్గరనే కాకుండా రాష్ట్ర రాజధానికి ఇసుక వెళ్లే మార్గంలో ముఖ్యమైన కూడళ్ల వద్ద కూడా నిఘా పెట్టాలని నిర్ణయించింది. ఈ క్రమంలో భద్రాచలం చెక్‌పోస్టు దగ్గర ఇటీవల టీజీఎండీసీ అధికారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ సాంకేతికతను ఉపయోగిస్తోంది. వచ్చి పోయే వాహనాల వీడియోలను సీసీ కెమెరాల్లో రికార్డు చేయడంతో పాటు నంబర్ ప్లేట్ ఆధారంగా.. తీసుకున్న పర్మిట్ ఏంటి? ఎక్కడి నుంచి ఎక్కడికి వెళుతోంది. సరైన మార్గంలోనే వెళ్తుందా, పక్కదారి పడుతోందా అనే విషయాలు తెలుసుకునే వీలుంది.

ఫలితాలపై ఆసక్తి..

మూడు రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి గేట్‌వేగా ఉన్న భద్రాచలం పట్టణం మీదుగా గంజాయి, ఇసుకల అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. దీన్ని అరికట్టేందుకు ఏడాది కాలంగా సాధారణ నిఘాను పోలీసులు, అబ్కారీ, టీజీఎండీసీలు పెంచాయి. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్‌తో పాటు ఆరిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను కూడా ఉపయోగించాలని నిర్ణయించారు. గంజాయి, ఇసుక అక్రమ రవాణాకు ఈ ఆధునిక నిఘాతోనైనా అడ్డుకట్ట పడుతుందనే ఆశాభావం ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ప్రస్తుతం అంతటా వినిపిస్తున్న ఏఐ టెక్నాలజీ నిఘా ఎలాంటి ఫలితాలు ఇస్తుందో తెలుసుకునేందుకు ప్రభుత్వ అధికారులు ఆసక్తి చూపిస్తున్నారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ చేరిక..

భద్రాచలంలో గోదావరి నది వద్ద తాజాగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు దగ్గర సీసీ కెమెరా ఫుటేజీలు, వీడియోల లైవ్ రికార్డింగ్‌లకు సరికొత్త ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థ కూడా తోడైంది. హైదరాబాద్‌కు చెందిన బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ సంస్థ అందించే సాంకేతిక సహకారంతో భద్రాచలం గోదావరి వంతెన దగ్గర నిఘా మరింత పటిష్టం కానుంది. లైసెన్స్ ప్లేట్ రికగ్నైజేషన్ (నంబర్ ప్లేట్ ఆధారిత సమాచారం), రూల్‌బేస్డ్ అలెర్టింగ్ (నిబంధనలకు అనుగుణంగా వాహనం ఉందా? ఏమైనా మార్పులు చేశారా ? ఉదా: పుష్ప తరహాలో పైన ట్రాక్టర్ బాడీ కింద గంజాయి తరలించే ఘటనలు జిల్లాలో కూడా జరిగాయి), బిహేవియరల్ అనామలీ (సందేహాస్పదంగా డ్రైవర్ ప్రవర్తన) తదితర ప్రాథమిక సమాచారాన్ని ఏఐ సాయంతో విశ్లేషించి గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెడుతుంది. ఏదైనా వాహనం సందేహాస్పదంగా కనిపిస్తే వెంటనే ఎస్సెమ్మెస్, వాయిస్ కాల్ రూపంలో సంబంధిత విభాగాల పోలీసులకు వాహనం వివరాలతో కూడిన అలెర్ట్‌ను పంపుతుంది. రాష్ట్ర మాదక ద్రవ్యాల నియంత్రణ సంస్థ (తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో) సహకారంతో ఈ వ్యవస్థను భద్రాచలం దగ్గర ఏర్పాటు చేశారు.

‘కాళేశ్వరం’పై తప్పుడు ప్రచారం తగదు

పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర రైతులకు వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టు అని, ఆ ప్రాజెక్టుపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేయడం తగదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. ఈ ప్రాజెక్ట్‌పై హైదరాబాద్ నుంచి మాజీ మంత్రి హరీష్‌రావు మంగళవారం ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను కొత్తగూడెంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో వీక్షించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. కాళేశ్వరంపై వేసిన పినాకీ ఘోష్ కమిషన్ కాంగ్రెస్ కమిషన్‌గా పనిచేసిందని ఆరోపించారు. కరువుతో అల్లాడిన రాష్ట్రాన్ని సుభిక్షంగా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో రాష్ట్రాన్ని నవ్వుల చేయాలనుకుంటున్న కాంగ్రెస్.. ప్రజల ముందు నవ్వుల పాలవుతుందని అన్నారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన సుమారు రెండేళ్లలో రూ.రెండు లక్షల కోట్ల అప్పు చేసిందని, ఏ హామీనీ సక్రమంగా అమలు చేయలేదని విమర్శించారు. మళ్లీ బీఆర్‌ఎస్సే అధికారంలోకి వస్తుందని, అప్పుడు కాళేశ్వరం ప్రాజెక్ట్ పిల్లర్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొస్తామని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, గ్రంథాల సంస్థ మాజీ చైర్మన్ దిండిగల రాజేందర్, నాయకులు రామకృష్ణ, కాపు సీతాలక్ష్మి, మంతపురి రాజుగౌడ్, కొట్టి వెంకటేశ్వర్లు, అనుదీప్, సత్యనారాయణ, జయరాం, కాంపెల్లి కనకేష్, సింధుతపస్వి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

వైభవంగా అగ్నిప్రతిష్ఠ



పవిత్రోత్సవాల సందర్భంగా పూజలు చేస్తున్న అర్చకులు



పవిత్రాలతో గిరి ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా కొనసాగుతున్నాయి. మంగళవారం యాగశాలలో, ఆలయంలో అగ్నిప్రతిష్ఠ, అష్టోత్తర శత కలశావాహనం, పవిత్రాధివాసం, హవనం నిర్వహించారు. ఈనెల 9 వరకు జరిగే ఈ పవిత్రోత్సవాల్లో బుధవారం స్నపన తిరుమంజనం, పవిత్రారోపణం, హోమం జరపనున్నారు. 9న ఉత్సవ సమాప్తి, హయగ్రీవ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు వెల్లడించారు. కాగా పవిత్రోత్సవాల సందర్భంగా 9వ తేదీ వరకు నిత్యకల్యాణాలు నిలిపివేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

8న వరలక్ష్మి వ్రతం, 22న పుష్పాంజలి..

శ్రావణ మాసోత్సవం సందర్భంగా ఈనెల 8వ తేదీన వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తామని, ఆ రోజున రామాలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని ఈఓ రమాదేవి తెలిపారు. సాయంత్రం 4 గంటలకు బేడా మండపంలో సామూహిక కుంకుమార్చన చేపడతామని చెప్పారు. అలాగే 22వ తేదీన సాయంత్రం 4గంటల నుంచి పుష్పాంజలి వేడుక ఉంటుందని, శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారికి వివిధ పుష్పాలతో అర్చన, విశేష భోగ నివేదన, మంత్రపుష్పం తదితర పూజలు జరుగుతాయని వివరించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆస్పిరేషన్ నుంచి ఇన్‌స్పిరేషన్‌గా మారాలి

కలెక్టర్ జితేష్ వి. పాటిల్



అదనపు కలెక్టర్ విద్యాచందనకు ప్రశంసాపత్రం అందిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

చుంచుపల్లి: ఆస్పిరేషన్ జిల్లాగానే కాకుండా దేశానికే ఆదర్శంగా నిలిచే ఇన్‌స్పిరేషన్ జిల్లాగా మారాలని, అందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ పిలుపునిచ్చారు. మంగళవారం ఐడీఓసీలో నిర్వహించిన సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్ జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో జిల్లా అగ్రస్థానంలో నిలిచి ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్‌గా గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు. ప్రతీ ఉద్యోగి సమర్థంగా పనిచేయడం వల్లే జిల్లా ఈ స్థాయికి చేరిందని తెలిపారు. ఇంకుడు గుంతలు తవ్వాలనే పిలుపుతో అన్ని గ్రామాల్లో చేపట్టిన ఈ సామూహిక కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపం, ఎనీమియా వంటి సమస్యలు ఎదుర్కొనేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యా రంగాన్ని బలోపేతం చేసేందుకు స్మార్ట్ అంగన్‌వాడీలు, డిజిటల్ తరగతులు, ఏఐ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. సీపీఓ సంజీవరావు మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో వివిధ శాఖలు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం కలెక్టర్‌ను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, డీపీఓ బాబూరావు, డీఎంహెచ్ఓ జయలక్ష్మి, మహిళా, శిశు సంక్షేమ శాఖాధికారి స్వర్ణలత లేనినా తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టుకు అవార్డు

టేకులపల్లి: ఐసీడీఎస్ టేకులపల్లి ప్రాజెక్టు పరిధిలోని గుండాల మండలంలో 100 శాతం న్యూట్రిషన్ సాధించింది. దీంతో మంగళవారం ఐడీఓసీలో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ కె.ఎం.తారతో పాటు సూపర్‌వైజర్లు స్వరాజ్యలక్ష్మి, ఖలీదాబేగం, పదిమంది అంగన్‌వాడీ సిబ్బందికి కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందించారు.

ప్లాంటేషన్ వేగవంతం చేయాలి

కొత్తగూడెంఅర్బన్: ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆవరణలో ప్లాంటేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అధికారులను ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి మంగళవారం ఆయన యూనివర్సిటీ ఆవరణలో చెట్ల తొలగింపు, పరిసరాల పరిశుభ్రత ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవనాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, తరగతి గదుల నిర్మాణానికి అనుగుణంగా ఆవరణను చదును చేయాలని సూచించారు. ఖాళీ ప్రదేశంలో విస్తృతంగా ప్లాంటేషన్ చేపట్టాలన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించే పనస, టికోమో, తెల్ల గన్నేరు, మందారం మొక్కలను నాటాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ సుజాత, ఇంజనీరింగ్, యూనివర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి ధరలో పురోగతి

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర కొంత మేర పెరిగింది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం క్వింటాకు రూ.14,350 ధర పలికింది. పంట సీజన్ ఫిబ్రవరిలో గరిష్ఠంగా రూ.14,200 పలకగా, ఏప్రిల్ మూడో వారం వరకు రూ.13,500, ఆపై రూ.12,200కు పడిపోయింది. జూన్‌లో అదే పరిస్థితి ఉండగా జూలై నుంచి పెరుగుతూ ఇప్పుడు రూ.14,350కు చేరింది. ఈ ధర కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసిన మిర్చికి పలకగా, నాన్ ఏసీ మిర్చి ధర గరిష్ఠంగా రూ.8,800గానే ఉండడం గమనార్హం.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ బేగంపేట, రామంతపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఖమ్మం ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. 2025–26 విద్యాసంవత్సరానికి ఖమ్మం జిల్లాకు రెండు సీట్లు కేటాయించగా, ఈనెల 8వ తేదీ లోపు తమ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు. జనన, కుల, ఆదాయ, స్థానికత ధ్రువపత్రాలతో పాటు రేషన్, ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలను గెజిటెడ్ అధికారి అటెస్టేషన్‌తో దరఖాస్తుకు జతచేయాలని తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా యూఎస్‌పీసీ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలని, 5,571 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులు మంజూరు చేయాలని, బీఈడీ అర్హత గల వారికి కూడా ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని అన్నారు. 2008 కాంట్రాక్టు ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2023 జూలై 1వ తేదీ నుంచి పీఆర్సీ అమలు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని, జీఓ 25ను సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పండిట్, పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేసి ఉద్యోగోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్, టీపీటీఎఫ్ తదితర సంఘాల నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, ఎస్.కృష్ణ, ఆర్.రమేష్‌కుమార్, బి.రాము, పాషా, ఆశాలత, సత్యశ్రీ, జి.హరిలాల్, వి.వరలక్ష్మి, బి.రాజు, పి.గంగరాజు, బి.హనుమంతు, డి. ఉమాదేవి, ఎండీ ఆసియా తదితరులు పాల్గొన్నారు.

చెరువు నిండలే.. అలుగు పోయలే

- వరిసాగుకు కలిసిరాని కాలం
- భారీ వర్షాలు కురిస్తేనే పూర్తిస్థాయిలో వరి నాట్లు
- వారం రోజులుగా చినుకు జాడ లేదు
- ఆలస్యమవుతున్న వానాకాలం పంటల సాగు



సగం కూడా నిండని తుమ్మలచెరువు

బూర్గంపాడు: వానాకాలం ప్రారంభమై రెండు నెలలు దాటినా జిల్లాలో భారీ వర్షాలు కురవలేదు. జూన్‌లో అడపాదడపా కురిసిన వర్షాలతో మెట్టపంటల సాగు మొదలైంది. జూలై మూడో వారంలో కురిసిన ఓ మోస్తరు వర్షాలతో చెరువులు, కుంటల్లో కొద్ది మేర నీరు చేరింది. దీంతో రైతులు వరి నాట్లు ప్రారంభించారు. అయితే జూలై చివరి వారం నుంచి చినుకు జాడ లేదు. దీనికి తోడు వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం వరినాట్లు సగం కూడా కాలేదు. భారీ వర్షాలు కురిసి చెరువులు నిండితే తప్ప పూర్తిస్థాయిలో నాట్లు పడే పరిస్థితి కనిపించడం లేదు.

జిల్లాలో 432 చెరువులు..

జిల్లాలో చిన్న, మధ్యతరహా, పెద్ద చెరువులు మొత్తం 432 ఉన్నాయి. జూలైలో కురిసిన మోస్తరు వర్షాలకు చిన్న చెరువులు, కుంటలు నిండాయి. మధ్య తరహా, పెద్ద చెరువులకు కొంతమేర నీరు చేరింది. అయితే చెరువులు పూర్తిస్థాయిలో నిండి అలుగు పోయలేదు. వర్షాలు కురుస్తుంటేనే వరి నాట్లు వేసేందుకు అనుకూల పరిస్థితులు ఉంటాయి. నాట్లు ప్రారంభమైనప్పటి నుంచి వానలు లేకపోవటంతో చెరువుల్లో ఉన్న కొద్దిపాటి నీటితోనే రైతులు పొలాల్లో దమ్ము చేసి నాట్లు వేస్తున్నారు. పది రోజులుగా వానలు కురవకపోవడంతో చెరువు నీటి వినియోగం బాగా పెరిగింది. ఇక పెద్ద చెరువులకు నీరు సరిపడా రాకపోవడంతో నాట్లు ఆలస్యమవుతున్నాయి. జిల్లాలో ఈ ఏడాది సుమారు 2.05 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటి వరకు 1.45లక్షల ఎకరాల్లో ఈ పంట సాగైనట్టు అంచనా. మిగతా 60 వేల ఎకరాల్లో సాగు భారీ వర్షాలపైనే ఆధారపడి ఉంది.

‘సీతారామ’ నీటితో నింపాలి..

జిల్లాలోని తుమ్మలచెరువు, సింగభూపాలెం, దోమలవాగు చెరువుల కింద వేల ఎకరాల ఆయకట్టు ఉండగా ఆ చెరువులు నిండలేదు. పెద్ద చెరువుల్లో సగం మేర మాత్రమే నీరు చేరింది. దీంతో ఆ నీటితోనే కొందరు రైతులు వరినాట్లు ప్రారంభించారు. కొన్ని చెరువుల కింద చివరి ఆయకట్టుకు నీరందే పరిస్థితి లేదు. దీంతో తుమ్మలచెరువు, దోమలవాగు చెరువును సీతారామ ప్రాజెక్ట్ నీటితో నింపాలని రైతులు కోరుతున్నారు. ఈ ప్రాజెక్ట్ నుంచి ఖమ్మం జిల్లాకు నీరు తరలిస్తున్న క్రమంలో తమకు సాగునీరు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది కూడా వరి చివరి దశలో ఉన్న సమయంలో చెరువుల్లో నీరు లేక సీతారామ కాల్వకు టేకులచెరువు గ్రామం వద్ద గండి కొట్టి దోమలవాగు చెరువు నింపుకున్నారు. ఈ ఏడాది ఆదిలోనే గడ్డు పరిస్థితులు కనిపిస్తుండగా సీతారామ నుంచి సాగునీరు అందించాలనే డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది.

తుమ్మల చెరువు నిండలేదు



ఈ ఏడాది తుమ్మలచెరువు ఇప్పటి వరకు నిండలేదు. ఇప్పటికి 14 అడుగుల మేర మాత్రమే నీరు చేరింది. వరినాట్లు ఆలస్యం అవుతుండడంతో తూములు తీసి నాట్లు ప్రారంభించాం. ఆగస్టులో భారీ వర్షాలు కురిస్తేనే చెరువు నిండి పంట పండే అవకాశం ఉంది.

– ఆవుల రవి, మల్లెలమడుగు, అశ్వాపురం మండలం

సీతారామ నీటితో నింపాలి



సీతారామ ప్రాజెక్ట్ కాల్వతో తుమ్మలచెరువు నింపాలి. వర్షాభావ పరిస్థితులతో చెరువులు నిండలేదు. ఆగస్టు మొదటి వారం వచ్చినా తుమ్మలచెరువు నిండలేదు. వరినాట్లు వేశాక కూడా ఇలాగే ఉంటే పరిస్థితి ఏంటనే ఆందోళన కలుగుతోంది.

– మేడవరపు మంగపతిరావు, మొండికుంట

అనుబంధానికి ఆర్టీసీ చేయూత!

- రాఖీ పండుగకు అదనపు సర్వీసులు
- ఖమ్మం రీజియన్‌లో 111 బస్సుల ఏర్పాటు

ఖమ్మంమయూరిసెంటర్: సోదరులకు రాఖీ కట్టేందుకు వచ్చివెళ్లే మహిళలతో రాఖీ పండుగకు రెండు రోజుల ముందు నుంచే బస్సుల్లో రద్దీ పెరగనుంది. ఈమేరకు ముందస్తు ఏర్పాట్లపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించారు. రద్దీకి అనుగుణంగా ఈనెల 7నుంచి 11వ తేదీ వరకు ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల నుంచి 111అదనపు సర్వీసులు నడిపించాలని నిర్ణయించారు.

వరుస సెలవులు

రాఖీ పౌర్ణమి రెండో శనివారమైన 9వ తేదీన వచ్చింది. పాఠశాలలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు సెలవు ఉండడం, ముందు రోజు కూడా శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహిళా ఉద్యోగులు సెలవు పెట్టి స్వగ్రామాలకు వెళ్లనున్నారు. ఇక పండుగ తర్వాత ఆదివారం రావడంతో మూడు రోజులు స్వస్థలాల్లో గడిపేలా కుటుంబాలతో సహా వెళ్లే అవకాశముంది. దీంతో 7వ తేదీ నుంచే అధికారులు ప్రత్యేక సర్వీసులు(అదనపు బస్సులు) నడపాలని నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి ఉమ్మడి జిల్లాకు వచ్చే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో అదనపు బస్సులన్నీ ఈ రూట్‌లోనే నడిపేలా కారాచరణ సిద్ధం చేశారు.

రిజర్వేషన్.. అదనపు చార్జీ?

రోజూ నడిచే సర్వీసులకు తోడు ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు డిపోల నుంచి అదనంగా 111 బస్సులు నడపిస్తారు. అయితే, అదనపు సర్వీసుల్లో రిజర్వేషన్ అమలు చేయడమే కాక సాధారణ చార్జీ కంటే అదనంగా వసూలు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఈమేరకు 60 బస్సుల్లో రిజర్వేషన్, మిగతా బస్సులు బస్సులను రిజర్వేషన్ లేకుండా నడపాలని నిర్ణయించారు. ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు హైదరాబాద్ నుండి ఉమ్మడి జిల్లాకు, 10, 11వ తేదీల్లో ఉమ్మడి జిల్లా నుండి హైదరాబాద్‌కు ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి. అత్యధికంగా ఖమ్మం డిపో నుంచి 24 ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తుండగా, మధిర, భద్రాచలం నుంచి 19చొప్పున, సత్తుపల్లి నుంచి 17, మణుగూరు నుంచి 14, కొత్తగూడెం నుంచి 11, ఇల్లెందు డిపో నుంచి ఏడు బస్సుల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు.

రద్దీకి అనుగుణంగా బస్సులు



రాఖీ పండుగకు వచ్చివెళ్లే ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నాం. ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఈ బస్సులు నడుపుతాం. బస్టాండ్లలో ప్రయాణికులకు సమాచారం ఇచ్చేలా ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నాం.

– ఏ.సరిరామ్, ఆర్‌ఎం, ఖమ్మం రీజియన్

క్లుప్తంగా

భద్రాద్రి ఫొటోగ్రాఫర్‌కు జాతీయస్థాయి అవార్డు


అవార్డుకు ఎంపికైన ఫొటో

భద్రాచలం టౌన్: పట్టణానికి చెందిన ప్రముఖ ఫొటోగ్రాఫర్ ఎస్కే షరీఫ్‌కు జాతీయస్థాయి అవార్డు లభించింది. ఈ మేరకు మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సృజనాత్మకత, సంస్కృతి కమిషన్, ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రాఫిక్ కౌన్సిల్ (ఐఐపీసీ), ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా (పీఏఐ) సహకారంతో ఏపీ ప్రభుత్వం నేషనల్ ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించింది. షరీఫ్ తీసిన చిత్రం ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించగా ఫొటో ఆఫ్ ది ఇయర్ అవార్డు–2025కు ఎంపికైంది. ఈ నెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో అవార్డును అందుకోనున్నట్లు షరీఫ్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో కీచకోపాధ్యాయుడు

- విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినవైనం

దుమ్ముగూడెం: మండల పరిధిలోని లక్ష్మీనగరం ఏకలవ్య పాఠశాలలో 6వ తరగతి విద్యార్థిని పట్ల పాఠశాల ఉపాధ్యాయుడు ఒకరు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. మూడు రోజుల క్రితం శరీరంపై ఉపాధ్యాయుడు చేయి వేసి అసభ్యకరంగా ప్రవర్తించాడని, కంటితో అసభ్యకరంగా సైగలు చేశాడని విద్యార్థిని తల్లికి తెలిపింది. దీంతో ఆమె పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేయగా, ప్రిన్సిపాల్ సదరు ఉపాధ్యాయుడికి మెమో జారీ చేసినట్లు తెలిసింది. కాగా ఈ ఘటనపై ఆర్‌సీఓ అరుణకుమారిని వివరణ కోరగా.. విషయం తన దృష్టికి వచ్చిందని, విచారణ చేస్తామని తెలిపారు.

చీటింగ్ కేసు నమోదు

ఇల్లెందురూరల్: పోలీసులు మంగళవారం చీటింగ్ కేసు నమోదు చేశారు. బాధితుడి కథనం ప్రకారం.. ఖమ్మానికి చెందిన ఈశ్వరప్రగడ రంగనాథ్ మండలంలోని సుభాష్‌నగర్‌లో బైక్ షోరూం ప్రారంభించాడు. నిర్వహణ బాధ్యతను ఇల్లెందుకు చెందిన యాలం దయాసాగర్‌కు అప్పగించాడు. ఏడాదిపాటు నిర్వహణ చేపట్టిన అతను యజమానికి తెలియకుండా రూ. 12.31 లక్షల విలువైన బైక్‌లను విక్రయించి నగదును తన సొంతానికి వాడుకున్నాడు. అందులో కొంత చెల్లించాడని, ఇంకా రూ. 8.82లక్షలు చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్నాడని బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై పోక్సో కేసు

పాల్వంచ: ఆన్‌లైన్‌లో పిల్లల లైంగిక వీడియోలు వీక్షించిన ఓ వ్యక్తిపై పాల్వంచ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. 2024 సంవత్సరంలో ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి పిల్లల లైంగిక వీడియోలు వీక్షించారు. ఈ క్రమంలో సైబర్ క్రైం అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

గ్రామాలకు వెళ్లకుండానే హాజరు

- పంచాయతీ కార్యదర్శుల ఇష్టారాజ్యం
- జిల్లా వ్యాప్తంగా 42 మందికి నోటీసులు
- బూర్గంపాడు మండలంలో అత్యధికంగా ఏడుగురు
- వారిని పర్యవేక్షించాల్సిన ఎంపీఓలపైనా చర్యలు



బూర్గంపాడు గ్రామపంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: పల్లె పాలనపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు మరిచి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ఏడాదిన్నర నుంచి గ్రామపంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. ఒక్కో కార్యదర్శికి రెండు, మూడు గ్రామాల చొప్పున అదనపు బాధ్యతలు అప్పగించారు. వేర్వేరు శాఖల నుంచి ప్రతీ గ్రామానికి ప్రత్యేక అధికారిని నియమించారు. వారిలో కొందరికి గ్రామాలపై అవగాహన లేకపోవడం, ఇతర బాధ్యతలు తదితర కారణాలతో పల్లె పాలన అస్తవ్యస్తంగా మారింది. మరోవైపు మండల పంచాయతీ అధికారులు (ఎంపీఓలు) కూడా దృష్టి పెట్టడంలేదు. దీంతో పంచాయతీ కార్యదర్శులు విధులకు హాజరుకాకుండానే హాజరైనట్లు హాజరు నమోదు చేసుకుంటున్నారు.

గ్రామాలకు వెళ్లకుండా పంచాయతీ సిబ్బందితో హాజరు నమోదు!

పచాయతీ కార్యదర్శులు ఉదయం 10గంటల లోపు గ్రామానికి వెళ్లి డీఎస్ఆర్ (డెయిలీ శానిటేషన్ రిపోర్టు) ముఖ గుర్తింపు యాప్ ద్వారా సెల్ఫీ ఫొటో దిగి హాజరు నమోదు చేసుకోవాలి. అనంతరం పారిశుద్ధ్య పనుల ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయాలి. అయితే కొందరు పంచాయతీ కార్యదర్శులు విధులకు వెళ్లకుండానే తన మొబైల్‌లో ఫొటో దిగి దానిని వాట్సాప్ ద్వారా పంచాయతీ సిబ్బందికి పంపి, ఓటీపీ చెబుతూ రోజువారీ హాజరు నమోదు చేసుకుంటున్నారు. ఇంకొందరు పంచాయతీ కార్మికుల ఫోన్లలోనే యాప్ ఇన్‌స్టాల్ చేశారు. దీంతో కార్మికులే డీఎస్ఆర్ యాప్‌లో కార్యదర్శి హాజరు వేస్తున్నారు. ఈ క్రమంలో కొందరు పాత ఫొటోలు, సంబంధం లేదని ఫొటోలను అప్‌లోడ్ చేస్తుండటంతో జూలైహాజరులో అధికారులు గుర్తించారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా 553 మందిని గుర్తించగా, జిల్లాకు చెందిన వారు 42 మంది కార్యదర్శులు ఉన్నారు. బూర్గంపాడు మండలంలో, పాల్వంచ మండలంలో ఆరుగురు ఉన్నారు. భద్రాచలంలో ఒకరు, చర్లలో ఇద్దరు, దమ్మపేటలో ఇద్దరు, దుమ్ముగూడెంలో ఇద్దరు, గుండాలలో ఐదుగురు, కరకగూడెంలో ఇద్దరు, ఆళ్లపల్లిలో ఇద్దరు, అశ్వాపురంలో ముగ్గురు, లక్ష్మీదేవిపల్లిలో ఇద్దరు, మణుగూరులో ఒకరు, ములకలపల్లిలో ముగ్గురు, సుజాతనగర్‌లో ఒకరు, టేకులపల్లిలో ఒకరు, ఇల్లెందు మండలంలో ఇద్దరు తప్పుడు హాజరు నమోదు చేసినట్లు గుర్తించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల పనితీరును పర్యవేక్షించాల్సిన ఎంపీఓలు, ప్రత్యేక అధికారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. దీంతో కలెక్టర్ జితేష్ వి.పాటిల్ 42 మంది కార్యదర్శులతో పాటు 17 మంది ఎంపీఓలను బాధ్యులను చేస్తూ నోటీసులు జారీ చేశారు. విచారణ అనంతరం శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నారు. తప్పుడు హాజరు నమోదు విషయం తేలడంతో ఇకనుంచి పంచాయతీ కార్యదర్శుల ఆన్‌లైన్ హాజరును నిత్యం మండల, డివిజనల్, జిల్లా పంచాయతీ అధికారులు పరిశీలించాలని పీఆర్ డైరెక్టర్ సృజన ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శులను సైతం బయోమెట్రిక్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.

చర్లలో ఇద్దరికి నోటీసులు

చర్ల: చర్ల మండలంలో కుదునూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి భూక్యా శరత్‌బాబు, సీ కత్తిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి గుగులోతు రాంబాబులకు కలెక్టర్ జితేష్ వి.పాటిల్ నోటీసులు జారీ చేశారు. శరత్‌బాబు 17 రోజులు, రాంబాబు 11 రోజులు ఫేక్ అటెండెన్స్ నమోదు చేశారు. కాగా మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

చర్యలు తప్పవు



పంచాయతీ కార్యదర్శులు తప్పుడు హాజరు నమోదు చేసినా, విధుల్లో నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే 42మంది పంచాయతీ కార్యదర్శులకు, 17మంది ఎంపీఓలకు నోటీసులు జారీ చేశాం. వివరణ అనంతరం వారిపై చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి కార్యదర్శులపై పర్యవేక్షణ పెంచుతాం.

–వి.చంద్రమౌళి, డీపీఓ

ఉద్యోగుల అశ్రద్ధతోనే లోపాలు

- విద్యాసంస్థల్లో తప్పు జరిగితే సిబ్బందిపై క్రిమినల్ కేసు
- భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్


ఖమ్మం వసతిగృహంలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

ఖమ్మంమయూరిసెంటర్: ఏడాదికాలంగా గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల్లో విద్యార్థులకు చదువు, ఆహారం, ఆరోగ్యం విషయంలో ఎలాంటి పొరపాట్లు జరగలేదని, కానీ ఇటీవల సిబ్బంది నిర్లక్ష్యం, వార్డెన్లు, హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్ల అశ్రద్ధతో లోపాలు వెలుగు చూస్తున్నాయని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన గిరిజన సంక్షేమశాఖ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఎంలు, వార్డెన్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులకు అల్పాహారం, భోజనాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కల్లూరు పాఠశాలలో జరిగిన ఘటనను హెచ్చరికగా భావించి ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు. ఇలాంటి పొరపాట్లు ఎక్కడ జరిగినా సిబ్బందిపై క్రిమినల్ కేసులు పెట్టి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పీఓ హెచ్చరించారు. వండిన ఆహారాన్ని ముందుగా ప్రిన్సిపాల్, హెచ్‌ఎం, వార్డెన్, ఉపాధ్యాయులు తిన్నాకే విద్యార్థులకు వడ్డించాలని పీఓ రాహుల్ స్పష్టం చేశారు.

గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. ఖమ్మంలోని పీఎంహెచ్ బాలుర వసతిగృహాన్ని తనిఖీ చేసిన ఆయన విద్యార్థులతో మాట్లాడారు. బోధన, మెనూపై ఆరా తీయడమే కాక భవిష్యత్ లక్ష్యాలపై ఆరా తీశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా తీరిక సమయంలో పుస్తకాలు చదవాలని సూచించారు. అనంతరం గిరిజన భవనాన్ని సందర్శించిన పీఓ శుభకార్యాల నిర్వహణకు ఇచ్చేలా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. తొలుత పీఓ ఖమ్మంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను సందర్శించి క్రయవిక్రయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమాల్లో ఏపీఓ(జనరల్) డేవిడ్ రాజ్, డీడీ విజయలక్ష్మి, ఉద్యోగులు నారాయణరెడ్డి, యు.భారతిదేవి పాల్గొన్నారు.

పోడు రైతులపై అటవీ అధికారుల దాడి ?


అటవీశాఖ అధికారులు దాడి చేశారని చెబుతున్న మహిళలు

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలం గడ్డోరగట్ట గ్రామంలో పోడు సాగు చేసుకుంటున్న రైతులపై అటవీ అధికారులు సోమవారం సాయంత్రం దాడి చేశారని తెలిసింది. పోడు భూముల్లో సాగు చేసిన పత్తి మొక్కలను అటవీ అధికారులు తొలగించారంటూ మాజీ ఎంపీ మిడియం బాబూరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కారం పుల్లయ్యతో కలిసి కొందరు రైతులు సోమవారం ఐటీడీఏ పీఓకు ఫిర్యాదు చేశారు. అదే రోజు సాయంత్రం గ్రామంలోకి వెళ్లిన అటవీ అధికారులు.. మళ్లీ పీఓ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేసుకోండి అంటూ తమపై దాడి చేశారని కుంజా జోగయ్య, మిడియం తులశమ్మ, సోడి రమణ, కణితి జయమ్మ తదితరులు ఆరోపిస్తున్నారు. ఫొటోలు తీయకుండా సెల్‌ఫోన్‌లు సైతం లాక్కున్నారని చెప్పారు. అయితే సీపీఎం జిల్లా నాయకులు యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య మంగళవారం బాధితులను పరామర్శించే వరకు ఈ ఘటన వెలుగులోకి రాకపోవడం గమనార్హం. దీన్ని సుమోటాగా స్వీకరించి అటవీ అధికారులపై కేసులు నమోదు చేయాలని వారు ఐటీడీఏ పీఓ రాహుల్‌ను కోరారు. దీనిపై దుమ్ముగూడెం అటవీ రేంజర్ కమలను వివరణ కోరగా మూడు రేంజ్‌ల పరిధి సిబ్బంది వనమహోత్సవం కార్యక్రమంపై డెమో ఇచ్చేందుకు సిబ్బంది వెళ్లగా ఇద్దరు గ్రామస్తులు తమను చూసి పారిపోయారని, తాము ఎవరిపైనా దాడి చేయలేదని చెప్పారు.

4కేజీల గంజాయి స్వాధీనం

మధిర: ఒడిశా నుంచి తీసుకొచ్చి మధిర చుట్టుపక్కల ప్రాంతాల్లో అమ్మేందుకు సిద్ధం చేసిన నాలుగు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మధిర టౌన్ సీఐ రమేష్ తెలిపారు. ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని భూక్యా అనూష్ నాయక్, కుంచం గోపీచంద్, మరో మైనర్ బాలుడు తీసుకొచ్చినట్లు అందిన సమాచారంతో మధిర టౌన్ ఎస్‌ఐ ఎం.కిషోర్‌కుమార్ ఆధ్వర్యాన మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈమేరకు రూ.2లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకోవడమే కాక కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.


రావిచెట్టు (ఫైల్)

నేలకొరిగిన మహావృక్షం

బూర్గంపాడు: బూర్గంపాడులోని ముదిరాజ్‌బజార్ ముత్యాలమ్మగుడి వద్ద ఉన్న 200 ఏళ్లనాటిదిగా భావించే రావిచెట్టు మంగళవారం నేలకొరిగింది. వేరువ్యవస్థ క్రమంగా దెబ్బతిని చెట్టుపడిపోయింది. ఎన్నో తరాలు చెట్టు నీడలో సేదతీరాయని స్థానికులు గుర్తుచేసుకున్నారు.


వేరువ్యవస్థ దెబ్బతినటంతో పడిపోయిన చెట్టు

పేదరికమే అర్హతగా పథకాలు


రేషన్‌కార్డు మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు

- ఎవరికి ఓటు వేశారో అడిగేది లేదు..
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: ఎవరికి ఓటు వేశారనేది పరిగణనలోకి తీసుకోకుండా కేవలం పేదరికమే అర్హతగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయించగా, మూడు విడతల్లో మిగతా వారికి సైతం ఇస్తామని వెల్లడించారు. తిరుమలాయపాలెంలో రూ.3.30 కోట్లతో నిర్మించే బీటీ రహదారులకు మంగళవారం మంత్రి శంకుస్థాపన చేశారు. ఆతర్వాత ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేయగా మంత్రి మాట్లాడారు. తిరుమలాయపాలెంకు ఐటీఐ కేటాయించగా, 30 పడకల ఆస్పత్రిని రూ.26 కోట్లతో 50 పడకలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనుండగా తమ ప్రభుత్వానికి దీవెనలు అందించాలని పొంగులేటి కోరారు. కాగా, భూభారతి చట్టం ఈనెల 15 నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుందని తెలిపారు.

చేత కాకపోతే రాజీనామా చేయండి

'జల్లేపల్లిలో డెంగీతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని తెలిసినా పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణలో అలసత్వం వహించడం సరికాదు... చేతకాకుంటే రాజీనామా చేయండి' అని ఎంపీడీఓ సిలార్‌సాహెబ్‌ను మంత్రి పొంగులేటి హెచ్చరించారు. జల్లేపల్లిలో సమస్యలపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో 'ఎన్నిసార్లు చెప్పినా తీరు మారదా.. నీ కోసం ప్రత్యేక జీఓ తేవాలా? నువ్వే పరిపాలన చేయ్.. లేకుంటే రాజీనామా చేయ్' అంటూ అసహనం వ్యక్తం చేశారు. కాగా, మండలంలోని బలరాంతండాకు చెందిన శివ కానరావడం లేదని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆయన తల్లి లలిత మంత్రి దృష్టికి తీసుకురాగా, పోలీసులకు పొంగులేటి సూచనలు చేశారు.

ఢిల్లీ దీక్షలో జిల్లా కాంగ్రెస్ నేతలు


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల, పక్కన ఎమ్మెల్యేలు, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్/వైరా: బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన నిరసన దీక్షలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎమ్మెల్యేలు మాలోతు రాందాస్‌నాయక్, కోరం కనకయ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పాల్గొనగా కేంద్రం తీరును వారు ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, నాయకులు వనం ప్రదీప్త చక్రవర్తి, గజ్జల వెంకన్న, జెర్రిపోతుల అంజనీకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


మోకాళ్ల పాపారావు (ఫైల్)

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కిన్నెరసాని క్రీడా పాఠశాలలో మూడేళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మోకాళ్ల పాపారావు(50) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నా రు. మృతదేహాన్ని స్వగ్రామమైన ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం చీమలపాడు గ్రామపంచాయతీ పాటిమీదగుంపునకు తరలించారు. పాఠశాల హెచ్‌ఎం రామారావు, తోటి ఉపాధ్యాయులు రూ.30 వేల ఆర్థికసాయాన్ని మృతుడి భార్యకు అందజేశారు.

వివాహిత అదృశ్యం


పిల్లలతో శ్యామల లావణ్య

అశ్వాపురం: మండల పరిధి లోని అమెర్ద గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశా రు. గ్రామానికి చెందిన వివాహిత శ్యామల లావణ్య (25) మణుగూరులోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి మంగళవారం ఉద యం 9 గంటలకు బయల్దేరి వెళ్లింది. సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబీకులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లేకపోవడంతో భర్త రవి ఫిర్యాదు చేయడంతో ఎస్సై మధుప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

భద్రాచలంటౌన్: మద్యం తాగి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడిన ఇద్దరికి భద్రాచలం ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ భవాని జైలు శిక్ష విధించారు. మద్యం మత్తులో వాహనం నడుపుతున్న 20 మందిని ట్రాఫిక్ పోలీసులు పట్టుకుని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయమూర్తి 18 మందికి జరిమానా విధించారు. అధిక మోతాదులో మద్యం తాగిన ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

మట్టి అక్రమ రవాణాపై కేసు నమోదు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ సమీపంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ మట్టి అక్రమంగా తోలుతున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. ఏఈ రమేష్ ఫిర్యాదు మేరకు సీఐ అశోక్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుండాల: ఇల్లెందు వెళ్తున్న టాటా మ్యాజిక్ బోల్తా పడి ఇద్దరికి గాయాలైన సంఘటన మంగళవారం జరిగింది. ఇల్లెందుకు చెందిన వాహనం గుండాల వచ్చి తిరు గు ప్రయాణంలో తూరుపాక గ్రామ సమీపంలో స్టీరింగ్ విరిగింది. దీంతో అదుపు తప్పి బోల్తా పడగా, డ్రైవర్ వెంకటేశ్వర్లు, ఓ ప్రయాణికుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో గుండాల ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

ఇదేం న్యాయం..?

- సింగరేణి మెడికల్ కళాశాలలో దక్కని సరైన వాటా
- సింగరేణీయులకు ఏడు సీట్లే కేటాయిస్తున్న వైనం
- ఏటా దరఖాస్తు చేసుకుంటున్న 200 మంది విద్యార్థులు
- కళాశాలకు స్థలం, రూ. 500 కోట్లు ఇచ్చిన సింగరేణి సంస్థ
- 40 శాతం సీట్లు కేటాయించాలని ఉద్యోగుల డిమాండ్



రామగుండంలోని సింగరేణి మెడికల్ కళాశాల

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(సిమ్స్)లో సింగరేణీయుల పిల్లలకు న్యాయమైన వాటా దక్కడంలేదు. దీంతో కార్మికులు, ఉద్యోగుల్లో నిరసన వ్యక్తమవుతోంది. పెద్దపెల్లి జిల్లా రామగుండంలో ప్రభుత్వం మెడికల్ కళాశాల ఏర్పాటు చేయగా సింగరేణి సంస్థ స్థలం ఇచ్చింది. రూ.500 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. దీంతో సింగరేణి మెడికల కళాశాలగా పిలుస్తున్నా.. సింగరేణి కార్మికుల పిల్లలకు కేవలం ఐదు శాతం అంటే ఏడే సీట్లే కేటాయించారు. సింగరేణి సంస్థలో సుమారు 40 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వీరి పిల్లలు ఏటా 2 వేల మంది ఎంబీబీఎస్‌లో ప్రవేశం కోసం నీట్ పరీక్ష రాస్తున్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఏటా సుమారు 200 మంది వరకు సింగరేణి మెడికల్ కళాశాలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. కానీ ఏడుగురికే సీట్లు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి ఉద్యోగుల పిల్లలకు సూపర్ యానిమేషన్ కింద 40 శాతం సీట్లు పెంచాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని, సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నారు.

మెరిట్ సీట్లనూ సింగరేణి కోటాలో చూపుతున్నారు...

ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఉద్యోగుల పిల్లలు సుమారు 200 మంది సింగరేణి హెచ్‌ఆర్‌డీ విభాగం ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో నీట్ పోటీ పరీక్షలో 500 మార్కులు వచ్చిన సింగరేణీయుల పిల్లలు సుమారు 200 మంది వరకు ఉండగా, రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా మెరిట్ ఆధారంగా అభ్యర్థులకు సీట్లు కేటాయించాలని కోరుతున్నారు. గతంలో ఇచ్చిన 5శాతం కాకుండా ఈ ఏడాది 40శాతం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నీట్ నిర్వాహకులు ఓవరాల్ మెరిట్ వచ్చిన సీట్లను కూడా సింగరేణి కోటాలో చూపుతున్నారని, దీంతో కార్మికుల పిల్లలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. కోల్‌బెల్ట్ ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు, సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు స్పందించి సింగరేణి ఉద్యోగుల పిల్లలకు కనీసం 40శాతం సీట్లు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఏడు సీట్లు ఇవ్వడం సరికాదు..



సింగరేణి యాజమాన్యం మెడికల్ కళాశాల ఏర్పాటుకు రూ.500 కోట్లతో పాటు స్థలం కేటాయించింది. అయినా కేవలం 5 శాతం అంటే 7 సీట్లు కేటాయించడం సరికాదు. సింగరేణీయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా?

– పీతాంబరరావు, ఐఎన్‌టీయూసీ కార్పొరేట్ ఉపాధ్యక్షుడు

ఫిర్యాదు చేస్తాం..



ప్రస్తుత విద్యాసంవత్సరంలో కార్మికులు, అధికారుల పిల్లలకు కోరిన విధంగా సీట్లు కేటాయింపు జరగాలి. లేకపోతే ఇండియన్ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేస్తాం. సీట్ల పెంపునకు అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఆందోళన చేస్తాం.

– రియాజ్ అహ్మద్, హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యదర్శి

కార్మిక సంఘాలను సంప్రదించకుండానే..



సింగరేణి యాజమాన్యం కనీసం కార్మిక సంఘాలను సంప్రదించకుండానే నేరుగా ప్రభుత్వానికి రూ.500 కోట్లు సమర్పించింది. అదే కంపెనీ మెడికల్ కళాశాల పెట్టి ఉంటే కార్మిక కుటుంబాలకు ఉద్యోగాలు, పిల్లలకు మెడికల్ సీట్లు వచ్చేవి.

– వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

సీట్ల పెంపు పరిశీలనలో ఉంది..



మెడికల్ కళాశాల సీట్ల పెంపు విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులు, అధికారుల పిల్లలకు మెరిట్‌తో సంబంధం లేకుండా సీట్లు పెంచే యోచనలో ఉంది. కార్మికులకు మెరుగైన వైద్యం కూడా అందించాలని భావిస్తోంది. ఉద్యోగుల అభివృద్ధి, సంక్షేమమే మాకు ప్రథమ ప్రాధాన్యం.

– ఎన్.బలరామ్, సీఎండీ